తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 139 02-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



మళ్లీ బాంబుల వాన



ఇరాన్ రాడార్, డ్రోన్ వ్యవస్థలపై అమెరికా దాడి

కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడి




మిగతా 2లో

తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి..

- హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం..
- క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!
- హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'
- తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారన్న పొన్నం
- హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న

కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్



కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట..

నడిరోడ్డుపై కూర్చున్న సామాన్యుడు! వీడియో వైరల్..

బెంగళూరులో నడిరోడ్డుపై గర్భిణీ భర్త ధర్నా

గవర్నర్ కాన్వాయ్ కోసం 30 నిమిషాలు ట్రాఫిక్ నిలిపివేతపై ఆగ్రహం

ఏపీ శాంతిభద్రతలను దెబ్బతీసేందుకు కుట్ర

- శాంతిభద్రతలను దెబ్బతీయడమే లక్ష్యం: లోకేష్
- రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాల ఆరోపణ
- ఆర్థిక లావాదేవీలపై సంచలన వ్యాఖ్యలు
- కుట్రలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్న మంత్రి



2లో

ఏంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధమే

మద్దతు ధర ప్రకటించడమే కాదు, వాటిని కొనుగోలు చేయాలి



- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ స్పందించట్లే...
- నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష కోసం నేను ఎవరినీ లెక్క చేయను
- రెండో విడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- గుడిసెలు లేని ఆదిలాబాద్‌ను చేస్తాం.. ప్రాణహిత కట్టి తీరుతాం
- ఆసిఫాబాద్ జిల్లా ప్రజాపాలన-పగతి బాట

మంచిర్యాల: జూన్ 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లు, మొక్కజొన్నలు, పొద్దుతిరుగుడు పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 67 లక్షల క్వింటాళ్ల వడ్లను సేకరించామని, ఇంకా 15 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని, వాటన్నింటినీ సేకరిస్తామని, మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటామన్నారు. సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి పంచాయతీ కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను రేవంత్ ప్రారంభించారు. మొదటి విడతలో పూర్తయిన లక్ష ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. రెబ్బెన మండలం కొండపల్లి శివారు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సోమవారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక సభలో మాట్లాడారు.



టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్!

'చంద్రబాబు మోసానికి రెండేళ్లు' పేరుతో ప్రత్యేక సమావేశం

గొడ్డలి పార్టీ అంటూ కొత్త డ్రామా మొదలెట్టారు

చంద్రబాబు పాలిట వైఎస్ జగన్ గొడ్డలి, త్రిశూలం కూడా

చంద్రబాబు చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మాస్టర్

2లో



ముప్పు వాటిల్లనివ్వం

- మా గడ్డపై భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగనివ్వం
- ప్రధాని మోదీకి మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హామీ
- ఢిల్లీలో ఇరునేతల ద్వైపాక్షిక చర్చలు

జనసేన సభకు అనుమతి నిరాకరణ..

హైదరాబాద్‌లో జనసేన సభకు పోలీసుల అనుమతి నిరాకరణ

శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని డీసీపీ వెల్లడి

ఏపీ నేతల వ్యాఖ్యలతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు ఉన్నాయని స్పష్టీకరణ


పార్కింగ్ సదుపాయం లేకపోవడం కూడా ఒక కారణమని వెల్లడి



కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- వైసీపీని ఏకిపారేసిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు. గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి



కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

గంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తుయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు. జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

జనసేన సభకు అనుమతి నిరాకరణ..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సమావేశం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడం లేదని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్యలు, పార్కింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీపీ మీడియాతో మాట్లాడుతూ.. జనసేన ప్రధాన కార్యదర్శి తమను కలిసి సభకు అనుమతి కోరారని తెలిపారు. ఈ సమావేశానికి సుమారు 2,000 మంది కార్యకర్తలు వస్తారని దరఖాస్తులో పేర్కొన్నారని చెప్పారు. అయితే, ఇటీవల ఏపీ నేతలు చేసిన కొన్ని వ్యాఖ్యల కారణంగా తెలంగాణలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని తెలిపారు. ముఖ్యంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్‌లో కేసులు నమోదు కావడంతో ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెలరేగే ప్రమాదం ఉందని అన్నారు. దీంతో పాటు, సభకు వచ్చే రెండు వేల మందికి సరిపడా పార్కింగ్ సౌకర్యం లేదని కూడా తెలిపారు. జనసేన నేతలు పార్కింగ్ కోసం ఎఫ్‌సీఐకి చెందిన భూమిని ఉపయోగించుకోవాలని భావించినా, ఆ భూమిపై కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించామని... ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో సభకు అనుమతి నిరాకరించినట్లు డీసీపీ స్పష్టం చేశారు.

కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. (సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట..

వీఐపీ భద్రత పేరుతో సామాన్య ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం, ఇబ్బందులపై కర్ణాటక రాజధాని బెంగళూరులో మరోసారి ప్రజాగ్రహం పెల్లుబిక్కింది. గవర్నర్ కాన్వాయ్ వెళ్లేందుకు వీలుగా పోలీసులు పాత విమానాశ్రయం (ఓల్డ్ ఎయిర్‌పోర్ట్) రోడ్డుపై సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడంతో భారీ గందరగోళం చెలరేగింది. ఈ ఊపిరాడని ట్రాఫిక్ జామ్‌లో అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్తున్న ఓ గర్భిణీ స్త్రీ, ఆమె భర్త చిక్కుకుపోయారు. పోలీసుల తీరుతో సహనం కోల్పోయిన ఆమె భర్త.. నిరసనగా నడిరోడ్డుపైనే బైఠాయించి ధర్నాకు దిగాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పాత విమానాశ్రయ రహదారిలో ప్రస్తుతం అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఈ రోడ్డు ఇప్పటికే ఇరుకుగా మారి, వాహనదారులు రోజూ నరకం చూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం గవర్నర్ కాన్వాయ్ ఆ దారి గుండా వెళ్లాల్సి ఉండటంతో సమస్య మరింత జటిలమైంది. మధ్యాహ్నం సుమారు 12:13 గంటల ప్రాంతంలో ఏఫ్తీుయఙ్ఞశ్రీజూతీఱఅఎవ అనే ఖాతా నుంచి ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ అయింది. "ఈరోజు, గవర్నర్ గారి రాకపోకల కారణంగా, సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది" అంటూ సదరు నెటిజన్ ఆ వీడియోను పంచుకున్నారు.

మళ్లీ బాంబుల వాన

దుబాయ్/వాషింగ్టన్: ఓవైపు పశ్చిమాసియాలో శాశ్వత శాంతిస్థాపనకు దౌత్యమార్గంలో చర్చలు జరుగుతుంటే మరోవైపు ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పశ్చిమాసియాలో బాంబులమోత మోగించాయి. గత వారం తమ అత్యాధునిక ఎంక్యూ--1 డ్రోన్‌ను ఇరాన్ క్షిపణులు కూల్చేసినందుకు ప్రతీకారంగా సోమవారం ఇరాన్‌కు చెందిన రాడార్ వ్యవస్థలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. డ్రోన్లను ప్రయోగించే ప్రయోగకేంద్రాలనూ అమెరికా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా దాడులకు ఇరాన్ ప్రతిదాడులతో ప్రతీకారంతీర్చుకుంది. అమెరికా వైమానిక స్థావరాలకు నిలయమైన కువైట్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. డ్రోన్లతో తెగబడింది. వీటిలో దాదాపు అన్నింటినీ కూల్చేశామని కువైట్ పేర్కొంది. "అంతర్జాతీయ జలాలపై నిఘా, పర్యవేక్షణ విధుల్లో ఉన్న తమ యూఎస్ ఎంక్యూ--1 డ్రోన్‌ను ఇరాన్ జలసమాధి చేసింది. అందుకే వాళ్ల రాడార్‌లను మేం నాశనంచేశాం. డ్రోన్ లాంఛింగ్ సైట్లను బూడిదచేశాం. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్, హార్మూజ్ జలసంధి గుండా మా రక్షణలో వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడికి బయల్దేరినా డ్రోన్లనూ నేలకూల్చాం. ప్రతిగా ఇరాన్ మొదలెట్టిన దాడుల్లో మా బలగాలకు, మా సైనిక సంపత్తికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు"అని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ సోమవారం ప్రకటించింది. ఆదివారం గెరూక్, ఖేష్మ్ ద్వీపం మీదా దాడులు చేశామని అమెరికా మిలటరీ పేర్కొంది. అయితే టెలికమ్యూనికేషన్ టవర్ మీద సైతం అమెరికా దాడిచేసిందని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. దౌత్యం జరుపుతూ దాడులు చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేల్ అసంతృప్తి వ్యక్తంచేశారు. "మొదట్నుంచీ అమెరికా మమ్మల్ని నమ్మట్లేదు. చర్చలు సైతం అపనమ్మకంతో కొనసాగుతున్నాయి.

తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి..

హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

ఏపీ శాంతిభద్రతలను దెబ్బతీసేందుకు కుట్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్ సీపీ) వ్యవహరిస్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు , ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా వైసీపీ నాయకత్వం అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రజల్లో అలజడి రేపడానికి, ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టడానికి ఆ పార్టీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తుంటే, దానిని అడ్డుకునేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకత్వం అనుసరిస్తున్న తీరుపై మంత్రి లోకేష్ తీవ్రమైన రాజకీయ విమర్శలు చేశారు.

టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్!

తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేంద్ర కార్యాలయంలో 'చంద్రబాబు మోసానికి రెండేళ్లు' పేరుతో నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో మహిళలకు ఇచ్చిన హామీల అమలు, మహానాడులో చేసిన ప్రకటనలు, ప్రభుత్వ పనితీరుపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, మాజీ మహిళా మంత్రులు, మాజీ మేయర్లు, మాజీ మహిళా ఎమ్మెల్యేలు, మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అంటూ సీఎం చంద్రబాబు కొత్త డ్రామా మొదలెట్టారని మండిపడ్డారు. చంద్రబాబు పాలిట వైఎస్ జగన్ గొడ్డలి, త్రిశూలం కూడా అని పేర్కొన్నారు. చంద్రబాబు చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మాస్టర్ అని విమర్శించారు. హామీలకు ఎగనామం, ప్రజలకు పంగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. మొన్న జరిగింది మహానాడు కాదు, లోగ్రేడ్ మహానాడు అన్నారు. టీడీపీకి, వైసీపీకి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబు-పవన్ కళ్యాణ్ బోత్ ఆర్ నాట్ సేమ్ అని.. టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్ అని సజ్జల చెప్పుకొచ్చారు.

ముప్పు వాటిల్లనివ్వం

న్యూఢిల్లీ: తమ భూభాగాలను భారత వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాగా మారనివ్వబోమని మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హ్లాయింగ్ పునరుద్ఘాటించారు. ఐదురోజుల భారత పర్యటన నిమిత్తం యూమిన్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. మయన్మార్ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచి అధ్యక్షపీఠాన్ని అధిరోహించిన రెండు నెలలకే ఆయన భారత్‌లో పర్యటనకు రావడం విశేషం. "భారత భద్రతా ప్రయోజనాలకు విఘాతం కల్గించే కార్యకలాపాలకు మయన్మార్‌ను నెలవు కానివ్వం. పొరుగుదేశంతో మిత్రత్వం మాకు ముఖ్యం"అని భారత ప్రధాని మోదీతో భేటీలో హ్లాయింగ్ స్పష్టంచేశారు. మోదీ, హ్లాయింగ్‌లో ద్వైపాక్షిక సమావేశం వివరాలను తర్వాత భారత విదేశాంగ శాక కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో పంచుకున్నారు. "ఏళ్ల తరబడి జుండా సైనికపాలన తర్వాత మయన్మార్‌లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హ్లాయింగ్ మోదీతో వాణిజ్యం మొదలు రక్షణ, సరిహద్దు భద్రత, అభివృద్ధిలో తోడ్పాటు, ఇంధనం, పెట్టుబడులు, వైద్యం, విద్య, కృత్రిమమేధ వంటి సంక్లిష్ట సాంకేతికతలో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మయన్మార్ సార్వభౌమత్వం, అంతర్గత సమగ్రతకు భారత్ కట్టుబడిఉంది. మయన్మార్‌లో నెలకొంటున్న శాంతియుత వాతావరణంపైనా మోదీ ఆరాతీశారు"అని మిస్రీ తెలిపారు. "1,640 కిలోమీటర్ల మేర సరిహద్దు పంచుకుంటూ మయన్మార్ భారత్‌కు వ్యూహాత్మకమైన పొరుగుదేశంగా కొనసాగుతోంది.

పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై రేవంత్ విరుచుకుపడ్డారు. కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషీ పంజాబ్, హరియాణాకు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. జూన్ 15లోపు ధాన్యం సేకరణ పూర్తవుతుందని, అన్ని పంటలను మద్దతు ధరతో కొనాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఆఫీసు ముందు ధాన్యాన్ని పోస్తామని హెచ్చరించారు. కేంద్రంతో యుద్ధమే ప్రకటిస్తామన్నారు. తెలంగాణ రైతుల పక్షాన పోరాటం చేసి మీ సంగతి తేలుస్తామని హెచ్చరించారు. కిషన్‌రెడ్డి తెలంగాణలో తిరగడానికి సమస్య అవుతుందన్నారు. సత్రంలో పెట్టే ఉచిత భోజనానికి నెల్లూరి పెద్దారెడ్డి సిఫారసు తీరుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కేంద్రం కొనుగోలు చేసేలా ఆయన బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు భూ సేకరణకు 1500 ఎకరాలు కోసం చర్చిద్దామని లేఖ రాస్తే కిషన్‌రెడ్డి నుంచి ఇప్పటికీ స్పందన లేదన్నారు. బస్సుయాత్ర పేరుతో బీజేపీ నాయకులు రైతుల వద్దకు వెళ్లడం కాదని దుయ్యబట్టారు. నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల



రైతాంగం హక్కులు, సమస్యలే ముఖ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కోసం ఎవరినీ లెక్కచేయని స్పష్టం చేశారు. ఏదైనా నేను మొదట పరిష్కారం చేసుకోవాలని చూస్తానని, అలా కాకపోతే పంచాయతీ పెట్టుకోవడానికి సిద్ధమేనని హెచ్చరించారు. తెలంగాణ అంటే ఎందుకు అంత చిన్నచూపని ప్రశ్నించారు. మహారాష్ట్ర సీఎంను ఒప్పించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించకపోగా, మీ ఆలోచన ఏంటని ప్రశ్నించారు. ప్రాణహితపై బరాజ్ కట్టి ఎల్లంపల్లి గ్రావిటీతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల రైతాంగానికి లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తీరుతామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన ప్రాణహిత--చేవెళ్లను విడిచిపెట్టి, కాళేశ్వరం కడితే కూళేశ్వరంగా మారిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ అంతర్రాష్ట్ర నదీ జలాలు పరిష్కారం చేసుకోవాలని చెబుతున్నారని, అయితే మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సహకరించడం లేదన్నారు. ఏడు మండలాలను ఏపీలో కలిపి లక్షలాది మందికి అన్యాయం చేశారని చెప్పారు. తాము మనుషులు, ఊళ్లను అడగం లేదని, కేవలం భూమి అడుగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మొదటి విడత 4.50 లక్షల ఇళ్లకు అదనంగా గూడేలకు 21వేలు అదనంగా ఇచ్చాం. లక్ష ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తున్నాం. ఇంకా ఇళ్లు రాని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండో విడతలో అందరికీ ఇళ్లు వచ్చేలా 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నాటికి మరో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గతంలో ఇల్లు వచ్చిన వారికి భాగస్వామ్యం చేసి అందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. పేదవారి ఆత్మగౌరవాన్ని పెంచే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి తీరుతామన్నారు.



పౌర్ణమి వేళ.. పరవశించిన భక్తజనం!

- భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామి వ్రతం
- లలితా, విష్ణు సహస్రనామ నామస్మరణలతో మారుమోగిన ఆధ్యాత్మిక వేదిక
- హాజరైన జై శ్రీమన్నారాయణ భక్త బృందం సభ్యులు

తొలివెలుగు, రాజాపేట: మండల కేంద్రంలో పౌర్ణమి పురస్కరించుకుని భక్తిభావం వెల్లివిరిసింది. జై శ్రీమన్నారాయణ భక్త బృందం సభ్యురాలు, స్థానిక అంగన్‌వాడీ టీచర్ రేపాక భాగ్యలక్ష్మి నివాస గృహంలో సామూహిక పారాయణ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గృహంలో ముందస్తుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వ్రత మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్త బృందం సభ్యులంతా కలిసి సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణాలతో పాటు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తుల నామస్మరణలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పారాయణాల అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక మంగళహారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నంగునూరు జగదాంబ, చామకూర అరుణ, రంగ లక్ష్మి, బోగ లత, మహేశ్వరి, నల్ల పద్మ, బిర్రు లక్ష్మి, పెంట రజిత, రేపాక భాగ్యలక్ష్మి, రేపాక వైష్ణవి తదితర భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ బడి.. ప్రగతికి గుడి!

- పాలిటెక్నిక్, టీజీఎస్ఆర్‌జేసీల్లో ఉత్తమ ప్రతిభ
- పదవ తరగతిలో 564 మార్కులతో బాసర త్రిపుల్ ఐటీ సీటు సాధించిన తేజస్విని
- ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించిన డీఈఓ కందుల సత్యనారాయణ



తొలివెలుగు, రాజాపేట: మండలం దూది వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుసగా ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ జిల్లా స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటున్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ఫలితాలు సాధిస్తూ, ప్రభుత్వ పాఠశాలల ఆశయాలను క్షేత్రస్థాయిలో నెరవేరుస్తున్నారు. గతంలో టీజీఎస్ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఇదే ఉత్సాహంతో గత విద్యా సంవత్సరం పదవ తరగతి (ఎస్ఎస్సీ) ఫలితాల్లోనూ పాఠశాల విద్యార్థిని గుల్లేన తేజస్విని 564 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటూనే పట్టుదలతో శ్రమించి ప్రతిష్టాత్మక బాసర త్రిపుల్ ఐటీ లో ఉచిత సీటును దక్కించుకుని పాఠశాల కీర్తిని దశదిశలా చాటింది.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం..

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. విజయలక్ష్మి నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం అందిస్తున్న నాణ్యమైన బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణ ఫలితంగానే విద్యార్థులు ఈ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని పలువురు కొనియాడారు. ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల అద్భుత విజయాలపై జిల్లా విద్యాధికారి (డీఈఓ) కందుల సత్యనారాయణ, మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎం విజయలక్ష్మిని, ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రగతిపై స్థానిక అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.


ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ


- రేణిగుంట పంచాయతీ పాలకవర్గం చొరవ
- ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు ఉపశమనం
- పాల్గొన్న సర్పంచ్ కర్రె వెంకటేశం, ఉపసర్పంచ్ బొల్ల హర్షవర్ధన్ రెడ్డి

తొలివెలుగు, రాజాపేట: మండలంలోని రేణిగుంట గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చొరవ చూపింది. ప్రస్తుత వేసవి కాలం, తీవ్రమైన ఎండల నేపథ్యంలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు సోమవారం ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు చల్లటి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కర్రె వెంకటేశం, ఉప సర్పంచ్ బొల్ల హర్షవర్ధన్ రెడ్డిలు వార్డు సభ్యులతో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి కూలీలకు స్వయంగా మజ్జిగను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీల ఆరోగ్యాన్ని కాపాడటం తమ బాధ్యతని, మండుతున్న ఎండల్లో పనిచేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో నీడ సౌకర్యంతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచామన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పాలకవర్గం ఉదారతతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం పట్ల కూలీలతో పాటు గ్రామస్తులు, పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.



నేమిల ఐకేపీ కేంద్రంలో 'ధాన్యం' దోపిడీ!





- వెయిటింగ్ ఛార్జీల పేరిట క్వింటాకు ఐదు రూపాయల వసూలు
- డ్రైవర్ల ఇష్టారాజ్యం.. ఇవ్వకుంటే లారీల నిలిపివేత
- తూకంలోనూ 'తరుగు' కష్టం.. క్వింటాకు మూడు కిలోలు అదనం
- రైతుల ఆవేదన.. పట్టించుకోని అధికారులు

తొలివెలుగు, రాజాపేట: మండలం నేమిల గ్రామ పరిధిలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో అన్నదాతలు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. ఒకవైపు అకాల వర్షాల భయం, మరోవైపు లారీల కొరతతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు రవాణా వాహనాల డ్రైవర్ల వసూళ్లు అశనిపాతంగా మారాయి. 'వెయిటింగ్ ఛార్జీ'ల పేరుతో ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించే లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు రైతుల నుంచి క్వింటాలుకు ఐదు రూపాయల చొప్పున అక్రమ వసూళ్లకు తెగబడుతున్నారు. ఐకేపీ కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు చేర్చాలంటే డ్రైవర్లు అడిగినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్తాకు రెండు రూపాయల చొప్పున (క్వింటాకు రూ. 5) లంచం ఇవ్వని పక్షంలో తాము లోడింగ్ చేసుకోబోమని, తమ వాహనాలు ఇక్కడి నుంచి కదలవని డ్రైవర్లు భీష్మించుకు కూర్చుంటున్నారు. దీంతో రోజుల తరబడి కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్న రైతులు.. తమ ధాన్యం మిల్లులకు వెళ్లదనే భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు అడిగినంత సమర్పించుకుంటున్నారు.

మూడు కిలోల అదనపు తూకం:

రైతుల కష్టాలు ఇక్కడితో తీరడం లేదు. కేంద్రంలో తూకం వేసే సమయంలో క్వింటాలుకు ఏకంగా మూడు కిలోల ధాన్యాన్ని ఎక్కువగా వేస్తూ నిర్వాహకులు తరుగు పేరిట మోసానికి పాల్పడుతున్నారు. తూకంలో నష్టపోవడంతో పాటు, చేతి నుంచి డ్రైవర్లకు అదనపు డబ్బులు చెల్లించాల్సి రావడంతో నేమిల కేంద్ర పరిధిలోని రైతులు రెండు విధాలుగా నష్టపోతూ ఆర్థికంగా కుంగిపోతున్నారు. ఈ అక్రమ దోపిడీ వ్యవహారం స్థానిక అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ, వారు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, రైస్ మిల్లుల యజమానులు, రవాణా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయ్యారని రైతులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నేమిల కేంద్రంలో తనిఖీలు చేపట్టి, డ్రైవర్ల వసూళ్లను అరికట్టాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

పండుగ వాతావరణంలో 'ఇందిరమ్మ ఇండ్ల' గృహప్రవేశాలు

- రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో సామూహిక ఉత్సవాలు
- సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల ఆనందం
- హాజరైన సర్పంచులు, పంచాయతీ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు



తొలివెలుగు, రాజాపేట: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం పండుగ వాతావరణంలో వైభవంగా జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సామూహిక గృహప్రవేశాల ఉత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

బొందుగులలో..

మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో లబ్ధిదారుడు మొక్క యాదయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పైఅవుల ఎల్లయ్య, ఉప సర్పంచ్ అబ్దుల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శేఖర్, యాదమ్మ, యాదగిరి, మునీర్, బాలకిషన్, సిద్ధులు తదితరులు పాల్గొని లబ్ధిదారుని కుటుంబ సభ్యులను అభినందించారు.

నేమిలలో..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షులు, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బిర్ల ఐలయ్యల పిలుపు మేరకు



నేమిల గ్రామంలో లబ్ధిదారుడు రోండ్ల మల్లారెడ్డి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం కనులపండువగా సాగింది. నేమిల సర్పంచ్ పులి రాజు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు, ఉప సర్పంచ్ మార్కా శివకుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ధర్మా హరినాథ్ రెడ్డి, జెట్ట సిద్దులు, చామకూరి శేఖర్ రెడ్డి, బత్తిని సుధాకర్, వార్డు సభ్యుడు నీల రాజు, నాయకులు కొలిపాక యాదగిరి, కొలిపాక బాలయ్య, పంచాయతీ కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

రఘునాథపురంలో..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రఘునాథపురం గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ ఘనంగా ప్రారంభించారు. పేదల సొంతింటి కల నెరవేరడం సంతోషదాయకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్, ఉప సర్పంచ్ కలకుంట్ల కళ్యాణి రాజు, వార్డు సభ్యులు కలకుంట్ల లక్ష్మి, తుంగ సతీష్, ముసలోజు ఉమారాణి, గవ్వల సిద్ధులు, బల్ల హరీష్, కటకం ప్రశాంత్, వడ్లకొండ మధు, తుంగ అక్షయ్, ఎర్ర మల్లేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోచంపల్లి నూతన ఎంపీడీవోగా మల్లం విజయ బాధ్యతల స్వీకరణ

- కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం
- ములుగు జిల్లా వాజేడు నుంచి బదిలీపై రాక



భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు మూర్తి): భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గా మల్లం విజయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో ఎంపీడీవోగా పనిచేసిన మల్లం విజయ, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా భూదాన్ పోచంపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, ఈవోపీఆర్డీ, ఇతర సిబ్బంది నూతన ఎంపీడీవోకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమెను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మల్లం విజయ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని స్పష్టం చేశారు.

శంకరయ్య మృతి బాధాకరం.. కుటుంబానికి సర్పంచ్ విక్రమ్ భరోసా



తొలివెలుగు, రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాధారపు శంకరయ్య అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గర్ధాసు విక్రమ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శంకరయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి సర్పంచ్ విక్రమ్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకరయ్య మరణం వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధా స్వామి, యువ నాయకులు సింగణబోయిన గణేష్, మీర్ ఖాజా అలీ, రాధారపు మల్లేశం, రాధారపు నర్సింహ, ఈర్లపల్లి మల్లయ్య పాల్గొన్నారు. అలాగే పాలసంఘం డైరెక్టర్ గర్ధాసు వెంకటేష్, బాజ నరేందర్, మేకల నరేందర్, గర్ధాసు శ్రీకాంత్, గర్ధాసు సాయి తదితరులు శంకరయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.




బాధిత కుటుంబానికి ఎంబీఆర్ ఫౌండేషన్ ఆసరా

- బసంతపురంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం పంపిణీ
- పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి

తొలివెలుగు, రాజాపేట: మండలంలోని బసంతపురం గ్రామానికి చెందిన కట్కూరి బాలనర్సయ్య ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎంబీఆర్ ఫౌండేషన్ మానవత్వంతో ముందుకు వచ్చింది. సోమవారం గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లిన ఫౌండేషన్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతు అండగా నిలిచారు. ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి, అధ్యక్షుడు గంధమల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాలనర్సయ్య కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం జరిగిందని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకటేష్, బాలనర్సయ్య, రామకోటి, భిక్షపతి, జి. శ్రీను, ఉపేందర్ రెడ్డి, రాజిరెడ్డి, రవి కుమార్, రమేష్, సురేష్, జె. మహేష్, సాయి రెడ్డి, శ్రీను, వినయ్, శివరామకృష్ణ, వి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగు నరసింహారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన గొంగిడి సునీత

- మాజీ ప్రభుత్వ విప్ చేతులమీదుగా మృతురాలి చిత్రపటానికి నివాళులు
- ఓదార్చిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు



తొలివెలుగు, రాజాపేట: మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బూరుగు నరసింహారెడ్డి తల్లి ఇటీవల వృద్ధాప్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి సోమవారం రేణికుంట గ్రామంలోని నరసింహారెడ్డి నివాసానికి వెళ్లారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్టెడు దుఃఖంలో ఉన్న బూరుగు నరసింహారెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను గొంగిడి సునీత ఓదార్చారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, నాయకులు చిత్రపురి వెంకట్రాంరెడ్డి, చింతలపూడి భాస్కర్ రెడ్డి, జలసాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జస్వంత్, గుర్రం నరసింహులు, మాజీ జెడ్పీటీసీ గోపాల్ గౌడ్, మాజీ సర్పంచులు కృష్ణ, ఉప్పలయ్య, ఇంజ నరసయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామ శాఖ అధ్యక్షుడు సోమలింగం, యువజన నాయకుడు గజ్జల రాజు, ఆత్మ మాజీ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, బాబు, సత్తయ్య తదితరులు పాల్గొని మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

చేనేత కార్మికుల చర్చలు సఫలం

- టాకాకు రూ. 185 పెంచేందుకు యాజమాన్యాల అంగీకారం
- సమ్మె విరమించిన రఘునాథపురం చేనేత కార్మికులు
- కార్మికుల ఐక్యతకు దక్కిన విజయం: సీపీఐ నేత చిగుళ్ల లింగం

తొలివెలుగు, రాజాపేట: మండలం రఘునాథపురంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న భావనరుషి చేనేత కార్మికుల సమ్మె ఎట్టకేలకు సుఖాంతమైంది. కార్మికుల న్యాయమైన డిమాండ్లను గుర్తించిన యాజమాన్యాలు దిగిరావడంతో, ఇరుపక్షాల మధ్య సోమవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఈ వివరాలను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం వెల్లడించారు. రఘునాథపురంలో యాజమాన్యాలు, భావనరుషి చేనేత కార్మికుల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చల్లో కీలక ఒప్పందం కుదిరింది. గతంలో టాకాకు రూ. 150 గా ఉన్న కూలిని.. ఇకపై రూ. 185 కు పెంచడానికి యాజమాన్యాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ప్రదర్శించిన అద్భుత ఐక్యత వల్లే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కొనియాడారు. కార్మికుల శ్రమను గుర్తించి సానుకూలంగా స్పందించిన యాజమాన్యాలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూలి పెంపు ఒప్పందంతో చేనేత కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్చల ముగింపు కార్యక్రమంలో సీపీఐ నాయకులు మూల పోచయ్య, కర్నాటి రాజేష్, ఎండీ దస్తగిరి, గణపురం నర్సింలు, దాసరి రమేష్, బల్ల శ్రీనివాస్, మదనాల వెంకటేష్, మదనాల శంకర్ తదితరులు పాల్గొని కార్మికులకు అభినందనలు తెలిపారు.



ప్రభుత్వ హాస్టళ్లలో వసతులపై ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

- మండల ప్రత్యేక అధికారులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం
- యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన
- నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి కావాలి





తొలివెలుగు, భువనగిరి: రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మండల ప్రత్యేక అధికారులను (స్పెషల్ ఆఫీసర్స్) ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో మౌలిక వసతుల నమోదు కోసం రూపొందించిన ప్రత్యేక ఆన్‌లైన్ యాప్ వినియోగంపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, భవనాల మరమ్మతుల అవసరాలు తదితర అన్ని మౌలిక వసతుల వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆన్‌లైన్ యాప్ ద్వారా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదైన సమాచారం ఆధారంగానే హాస్టళ్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేసి, చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలని, అధికారులు ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

- జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వక భేటీ.. ఆశీస్సులు అందజేసిన సీఎం
- నియోజకవర్గ ప్రజల సేవకే నా జీవితం అంకితం: ఎమ్మెల్యే వీరేశం



తొలివెలుగు, రామన్నపేట/ హైదరాబాద్: నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం తన జన్మదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లిన ఆయన, సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువా కప్పి వేముల వీరేశంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వేముల వీరేశం మాట్లాడుతూ.. తన జన్మదిన వేడుకలను నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పండుగ వాతావరణంలో పెద్ద ఎత్తున నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తనపై చూపుతున్న అపారమైన ప్రేమ, అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తన జీవితాన్ని అంకితం చేస్తానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేర్చడానికి నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా విప్ వీరేశం పునరుద్ఘాటించారు.

పల్లెటూరి కుర్రాడికి 'గిన్నిస్' గుర్తింపు!

- 22 దేశాల పోటీదారులను దాటి కీబోర్డ్‌లో అదరగొట్టిన జోసఫ్ ప్రిన్స్
- గచ్చిబౌలి వేదికగా గ్లోబల్ రికార్డు సాధించిన పల్లివాడ యువకుడు
- తల్లిదండ్రులు, చర్చి నిర్వాహకుల హర్షాతిరేకాలు



తొలివెలుగు, రామన్నపేట: మన పల్లెటూరి ప్రతిభ ప్రపంచ వేదికపై రెపరెపలాడింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన ఓ గ్రామీణ యువకుడు అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. మండల పరిధిలోని పల్లివాడ గ్రామానికి చెందిన బాదే విజయ్ - లీల దంపతుల కుమారుడు, హల్లెల్ మ్యూజిక్ స్కూల్ చైర్మన్ బాదే జోసఫ్ ప్రిన్స్ ఈ అరుదైన ఘనత సాధించారు.ఁహైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఆడిటోరియంలో 'హల్లెల్ మ్యూజిక్ స్కూల్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గిన్నిస్ అచీవర్స్ మీట్'లో ఆయన పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో ప్రపంచంలోని 22 దేశాల నుండి దాదాపు 2000 మందికి పైగా కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొని, గంటల తరబడి విరామం లేకుండా కీబోర్డ్ వాయిస్తూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 777 మంది విద్యార్థులతో పాటు జోసఫ్ ప్రిన్స్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ ఘనత సాధించిన జోసఫ్ ప్రిన్స్‌ను లైఫ్ ఎడిఫైర్స్ చర్చి వ్యవస్థాపకులు జోనాతన్, చర్చి సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జోసఫ్ ప్రిన్స్ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు చిన్నతనం నుంచే కీబోర్డ్ నేర్చుకోవడానికి ఎంతో ప్రోత్సహించారని, అలాగే చర్చి సంఘ కాపరి జోనాతన్ ఇచ్చిన స్ఫూర్తితోనే ఈ రోజు అంతర్జాతీయ వేదికపై గిన్నిస్ రికార్డు సాధించగలిగానని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతం నుండి వెళ్లి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న జోసఫ్ ప్రిన్స్‌ను మండల ప్రముఖులు కొనియాడారు.



గ్రామ పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

- ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికుల ధర్నా
- రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్
- సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేత

తొలివెలుగు, రామన్నపేట: గ్రామ పంచాయతీ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రామన్నపేట మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో నిరంతరాయంగా సేవలందిస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మల్టీపర్పస్ వర్కర్ విధానం కారణంగా కార్మికులపై అధిక పనిభారం పడుతోందని, దీంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే కార్మికులందరికీ ప్రభుత్వ ఖర్చుతో భీమా సదుపాయం కల్పించాలని, పంచాయతీ సిబ్బంది జీతాలను గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా ప్రభుత్వమే చెల్లించే విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంధన భిక్షం, రామన్నపేట మండల అధ్యక్షుడు గాదె ఎల్లయ్య, యూనియన్ నాయకులు మంచాల రేణుక, బొడ్డు సాలయ్య, సుగుణమ్మ, అలివేల, పూలమ్మ, జయమ్మ, సాలమ్మ, మంగమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

సాంకేతిక నైపుణ్యాలతోనే మెరుగైన ఉపాధి

- ఉచిత 'ఏఐ', ఇంటర్వ్యూ స్కిల్స్ శిక్షణను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్
- మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ప్రతిభను పెంచుకోవాలి: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా 12 రోజుల శిక్షణా శిబిరం





తొలివెలుగు, భువనగిరి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను అందుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన శిక్షణ ఎంతో అవసరమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (టీం సొసైటీ), మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా తరగతులను సోమవారం ఆయన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిలతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా టీం సొసైటీ నిధులతో 12 రోజుల పాటు నిర్వహించే ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఇంటర్వ్యూ స్కిల్స్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు.. అక్కడ విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, బోధనా విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో ఏఐ, చాట్ జీపీటీ పాత్ర అత్యంత కీలకమైనదని, ఇటువంటి అత్యాధునిక సాంకేతికతపై జిల్లా యువతకు ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ సాధనలో రాణించాలని ఆకాంక్షించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందేందుకు ఈ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమన్నారు. శిక్షణను నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించి ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, ఆర్డీవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అడుగుజాడల్లోనే ప్రగతి బాట!

- ఘనంగా మునుగోడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు
- యువజన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్
- నోట్ పుస్తకాలు అందజేసిన ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా
- క్యాంపు కార్యాలయంలో పూలమాలలు, శాలువాతో ఘన సత్కారం



తొలివెలుగు, చౌటుప్పల్: మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మ సోమవారం ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లిన సర్పంచ్.. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు అందజేశారు. తన జన్మదినం సందర్భంగా హంగులు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ పేద విద్యార్థులకు తోడ్పాటునందించాలంటూ ఎమ్మెల్యే చేసిన సూచనకు సర్పంచ్ సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఉపయోగపడే విధంగా నోట్ పుస్తకాలు, పెన్నులను ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. అనంతరం రాజగోపాల్ రెడ్డికి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మ మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ధర్మోజిగూడెం గ్రామ ప్రగతికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు

- సామాన్యుడి సొంతింటి కల నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం
- వివిధ వార్డుల్లో ఇండ్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు
- రానున్న రోజుల్లో రెండో విడత ఎంపికలు



భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు మూర్తి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవాని సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా సాకారం చేస్తోందని భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. పోచంపల్లి పురపాలక కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పురపాలక పరిధిలోని 12, 13, 4, 6 వార్డుల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలను స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో పేదలు ఇండ్ల కోసం ఎదురుచూసి అలసిపోయారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందుతున్నాయని తెలిపారు. ప్రతి సామాన్యుడికి ఆత్మగౌరవంతో కూడిన సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, దీని ద్వారా మరింత మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ సూరపల్లి రాధికా రమేష్, 4వ వార్డు కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, వార్డు అధికారిణి గీత, యువజన నాయకులు రుద్ర చందు, జింకల జయసూర్య, గజ్జి నరేందర్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు మత్స్య సహకార సంఘం కమిటీ ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా దాశబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా సత్తయ్య
- ఎన్నికల అధికారి అశోక్ కుమార్ సమక్షంలో ఎన్నిక
- మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తాం: నూతన పాలకవర్గం

తొలివెలుగు, వలిగొండ: మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామ మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గ కమిటీ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల అధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల ప్రక్రియలో సంఘ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రావడంతో నూతన కమిటీ ఏకగ్రీవమైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా దాశబోయిన రాజు, ఉపాధ్యక్షుడిగా పెద్దబోయిన సత్తయ్య, కార్యదర్శిగా పెద్దబోయిన వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు పాలకవర్గ సభ్యులుగా తాళ్ల సత్యం, పెద్దబోయిన శ్రీహరి, బుంగమట్ల నరసింహ, బోళ్ల శేఖర్, పెద్దబోయిన అభిరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అశోక్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దాశబోయిన రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అత్యున్నత బాధ్యతను అప్పగించిన సంఘ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రొద్దుటూరు మత్స్య సహకార సంఘం అభ్యున్నతికి, మత్స్యకారుల ఆర్థిక సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి గ్రామ పెద్దలు, మత్స్యకారులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

అల్లాపురంలో వైభవంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

- కలెక్టర్ ఆదేశాలతో మల్లేష్ దంపతులకు తీరిన సొంతింటి కల
- లబ్ధిదారులకు నూతన వస్త్రాలు బహుకరించిన సర్పంచ్ టేకుల మంజులారెడ్డి
- ఇంతకాలానికి గూడు దొరికింది: లబ్ధిదారుల హర్షం
- లబ్ధిదారులను సత్కరించిన సర్పంచ్ టేకుల మంజులారెడ్డి, ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి యాదవ్

తొలివెలుగు, చౌటుప్పల్ : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండల పరిధిలోని అల్లాపురం గ్రామంలో సోమవారం ఒక నిరుపేద కుటుంబానికి సొంత గూడు లభించింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన బోళ్ల మల్లేష్ – భాగ్యమ్మ దంపతులు తాము నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంట్లోకి శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజులారెడ్డి, ఉపసర్పంచ్ లింగస్వామి యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ టేకుల మంజులారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలుగా ఉంటూ, ఇప్పటివరకు అసలు నిలువడానికి సరైన ఇల్లు లేక ఎన్నో ఇబ్బందులు పడిన మల్లేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా శాశ్వత నివాసం ఏర్పడటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందిస్తామని చెప్పారు. గృహప్రవేశం చేసిన మల్లేష్ దంపతులకు సర్పంచ్ మంజులారెడ్డి దంపతుల తరఫున నూతన వస్త్రాలను బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమకు ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి, సహకరించిన అధికారులకు, సర్పంచ్‌కు లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు యంజాల లింగస్వామి, సామ సుమిత్ర పెద్దిరెడ్డి, యంజాల శ్రీకాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పులిగిల్లలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

- కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసిన సర్పంచ్ వేముల అనూష
- పేద ప్రజల సొంతింటి కలలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు



తొలివెలుగు, వలిగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాని సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా సాకారం చేస్తోందని పులిగిల్ల గ్రామ సర్పంచ్ వేముల అనూష అన్నారు. వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 45 ఇండ్లు మంజూరయ్యాయి. వీటిలో లబ్ధిదారులు వేగంగా నిర్మించుకున్న మొదటి విడత నాలుగు ఇండ్లు పూర్తి కావడంతో సోమవారం వాటిని సర్పంచ్ వేముల అనూష కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ.. నిరుపేదల ఆత్మగౌరవాన్ని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని, గ్రామ గ్రామాన ఈ పథకానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల సంక్షేమమే ధ్యేయంగా సన్న బియ్యం పంపిణీ, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, మహిళలకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ ఇండ్ల నిర్మాణానికి సహకరించిన స్థానిక శాసనసభ్యునికి లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జోగు సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుగ్గ వెంకటేష్, వార్డు సభ్యులు కనుగొంటి పాండు, సిల్వేరు మహేష్, పర్వతం సంతోష, వేముల అనిత, వేముల నాగరాజు, దొడ్డి స్వర్ణలత, పిన్నింటి ఉమారాణి, కంచి శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే ఇందిరమ్మ కమిటీ చైర్మన్ కొమ్మిడి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు వాకిటి సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుగ్గ మనోజ్, బుగ్గ మల్లయ్య, బుగ్గ బీరప్ప, మెరుగు కృష్ణ, పర్వతం రాజు, బంధారపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల పొట్టగొడుతున్న 'యాప్'.. రెక్కల కష్టానికి దక్కని ఫలితం!

- లక్ష్మీదేవి కాలువ గ్రామంలో 'ఉపాధి' కూలీల ఆవేదన
- సిగ్నల్ తిప్పలు.. ఫోన్లు హ్యాంగ్.. గ్రూపుల హాజరు గల్లంతు
- పాత విధానాన్నే పునరుద్ధరించాలని లక్ష్మీదేవి కాలువ కూలీల డిమాండ్
- వికలాంగ ఫీల్డ్ అసిస్టెంట్‌కు పింఛన్ కట్..



గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు





తొలివెలుగు, అడ్డగూడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విధానాలు కూలీల పొట్ట గొడుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవి కాలువ గ్రామంలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అమలవుతున్న డిజిటల్ హాజరు, ఐరిస్ (కంటి గుర్తింపు) విధానం వల్ల తాము ఉపాధిని, కూలి డబ్బులను నష్టపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సోమవారం ఉపాధి పనుల వద్ద కూలీలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం పని ప్రారంభించే సమయంలో కంటి గుర్తింపు (ఐరిస్) తప్పనిసరి చేశారు. అయితే వయసు పైబడటం, ఎండ తీవ్రత కారణంగా చాలా మంది కూలీలకు 'ఐరిస్' నమోదు కావడం లేదు. దీంతో వారు రోజంతా కష్టపడినా హాజరు పడక పనిదినాలు కోల్పోవాల్సి వస్తోంది. దీనికి తోడు పని ముగిసిన తర్వాత రెండో విడత సమూహ (గ్రూప్) ఫోటో తీసే సమయంలో సాంకేతిక ఇబ్బందులు శాపంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ సరిగ్గా అందకపోవడం, అధికారుల స్మార్ట్‌ఫోన్లు 'హ్యాంగ్' అవ్వడం వంటి కారణాల వల్ల గ్రూప్‌లోని పది మంది కూలీల హాజరు ఆ రోజంతా రద్దవుతోంది. చేసిన పనికి పైసా రాక, అటు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇటు కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇప్పుడున్న యాప్ విధానాన్ని పక్కనబెట్టి పాత పద్ధతిలోనే హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీతం వస్తోందని పింఛన్ కట్ చేస్తారా?: ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్

"నేను వికలాంగుడను. గత ప్రభుత్వాల హయాంలో నాకు రెగ్యులర్‌గా వికలాంగుల పింఛన్ వచ్చేది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం రూ. 20,000 పైబడి జీతం ఉన్నవారికే పింఛన్ కట్ చేస్తున్నామని చెబుతూ.. నా పింఛన్‌ను కూడా రద్దు చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ప్రభుత్వ శాశ్వత ఉద్యోగం కాదు, కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేస్తున్నది మాత్రమే. మాకు వచ్చే అరకొర జీతానికి తోడు ఆసరాగా ఉన్న వికలాంగుల పింఛన్‌ను కూడా తీసివేయడం చాలా బాధాకరం. నాలాంటి దివ్యాంగులను ప్రభుత్వం మోసం చేయడం తగదు, నా పింఛన్‌ను నాకు పునరుద్ధరించాలి."



చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోయ దేవేందర్

- రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- నియామక పత్రాన్ని అందజేసిన జిల్లా అధ్యక్షుడు బీర్ల అయిలయ్య
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: దేవేందర్


తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని పంతంగి గ్రామానికి చెందిన బోయ దేవేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో దేవేందర్ ఎంపిక ఏకగ్రీవమైంది. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేతుల మీదుగా దేవేందర్‌కు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి మండల పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా, నిరంతరం శ్రమిస్తూ తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి పూర్తి స్థాయిలో సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు బీర్ల అయిలయ్య, ప్రముఖ నాయకులు ఆడెం సంజీవరెడ్డి, పబ్బు రాజుగౌడ్, ఉబ్బు వెంకటయ్య, చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, తాడూరి వెంకట్ రెడ్డిలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

మందలపై కుక్కల విలయం.. కాపరుల కన్నీరు!

- జీవాలను కోల్పోయిన పెంపకందారులను ఆదుకోవాలి
- చౌటుప్పల్ ఆర్డీఓ ఆఫీస్ ఎదుట 'జీఎంపీఎస్' నిరసన, వినతిపత్రం అందజేత







తొలివెలుగు, చౌటుప్పల్: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద గొర్రెల కాపరులకు వీధి కుక్కలు నిద్రలేకుండా చేస్తున్నాయి. గుంపులుగా వస్తున్న కుక్కలు మందలపై పడి జీవాలను వేటాడి చంపుతుండటంతో పెంపకందారుల బతుకులు రోడ్డున పడుతున్నాయి. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ఉన్న ఈ కుక్కల బెడదను నివారించాలని, నష్టపోయిన కాపరులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండే శ్రీశైలం, మండల అధ్యక్షులు భీమనగోని బాలరాజ్ 'సాక్షి'తో తమ ఆవేదనను పంచుకున్నారు. మండలంలో కుక్కల దాడి రోజురోజుకూ మితిమీరిపోతోందని, ఇటీవల మందోల్లగూడెం గ్రామంలో కాటం లింగస్వామికి చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి గొర్రె పొట్టేళ్లను కొరికి చంపేయడం పెంపకందార్లను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. కేవలం గొర్రెలే కాకుండా పశువులను సైతం కుక్కలు వదలడం లేదని వాపోయారు. జీవాలే జీవనాధారంగా బతుకుతున్న కుటుంబాలకు ఈ నష్టం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం స్పందించి బాధితులకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కుక్కల నివారణకు పంచాయతీ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుణముని ఐలయ్య, మండల సహాయ కార్యదర్శి గజ్జి పాండు, జంగయ్య, మల్లయ్య తదితర పెంపకందారులు పాల్గొన్నారు.

ప్రజల మధ్య కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

- సతీమణి లక్ష్మితో కలిసి 59 మొక్కలు నాటిన మునుగోడు ఎమ్మెల్యే
- క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం.. యువత ఉత్సాహం
- నోట్‌బుక్స్, పెన్నులు బహుకరించిన అభిమానులు, నాయకులు
- శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ చామల కిరణ్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



తొలివెలుగు, చౌటుప్పల్/మునుగోడు: మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 59వ జన్మదిన వేడుకలు సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ ప్రజలు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆయన ఈ వేడుకలను జరుపుకున్నారు. తన 59వ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన సతీమణి లక్ష్మితో కలిసి క్యాంపు కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా 59 మొక్కలను నాటారు. అనంతరం కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రక్తాన్ని విరాళంగా ఇస్తున్న యువకులను అభినందించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు రాజగోపాల్ రెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం



చేశారు. అనంతరం ఆయన తన సతీమణి లక్ష్మి, కుమారుడు సంకీర్త్ రెడ్డి, కోడలు తరుణ్య, మనమరాలు వాస్యతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యలు మునుగోడు క్యాంపు కార్యాలయానికి చేరుకుని రాజగోపాల్ రెడ్డికి శాలువా కప్పి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తన పుట్టినరోజుకు బొకేలు, శాలువాలు తీసుకురావద్దని, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ బుక్స్, పెన్నులు తీసుకురావాలని ఎమ్మెల్యే ముందుగానే పిలుపునివ్వడంతో.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున నోట్ పుస్తకాలను ప్రెసెంట్ చేశారు. నియోజకవర్గ ప్రజల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఘనంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యే దంపతులకు ఘనస్వాగతం పలికిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్లు, అధికారులు
- పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తుల పంపిణీ


తొలివెలుగు, ?చౌటుప్పల్ : మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి – లక్ష్మి దంపతులకు మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ దంపతులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరిన నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ?ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఒక వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తూ, సమాజానికి ఎనలేని సేవలు అందిస్తున్న మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు (సఫాయీ కర్మచారీలు) ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు తమ చేతుల మీదుగా నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన జన్మదినం నాడు శ్రమజీవులైన పారిశుద్ధ్య కార్మికులకు







దుస్తులు పంపిణీ చేసే అవకాశం కల్పించిన చైర్‌పర్సన్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి

- ఏకగ్రీవంగా ఎంపికైన లక్కారం నేత
- నియామక పత్రాన్ని అందజేసిన జిల్లా అధ్యక్షుడు బీర్ల అయిలయ్య
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా: శ్రీనివాస్‌రెడ్డి

తొలివెలుగు, చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మున్సిపల్ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక ఏకగ్రీవమైంది. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేతుల మీదుగా శ్రీనివాస్‌రెడ్డికి అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మున్సిపల్ పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వార్డుల్లోని స్థానిక సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

